క్లుప్తంగా

అమరజీవి పోరాటం స్ఫూర్తిదాయకం



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: అమర జీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తన నివాసంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారని వివరించారు. నేటి తరం ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కరాటే క్రీడాకారులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్ల బహూకరణ



సర్టిఫికెట్ అందిస్తున్న పేడాడ రమణికుమారి

మర్రిపాలెం: మర్రిపాలెం రైల్వే స్కూల్‌లో గురువారం వాడో-కాయ్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. 200 మంది కరాటే విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులు వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, ఆంధ్రా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ అండ్ డైరెక్టర్ ఎస్.విజయ్ మోహన్ చేతుల మీదుగా టెస్ట్‌లో పాల్గొన్న క్రీడాకారులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లను బహూకరించారు. కార్యక్రమంలో చీఫ్ ఎగ్జామినర్ సతీష్‌కుమార్, నూకరాజు, కె.శివగణేష్, బి.శ్రీనివాసరావు, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

బుల్లయ్య కాలేజీలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మధుకుమార్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభమవుతున్న సందర్భంగా గురువారం కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ సంబంధిత పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో గత నెలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కోర్సు క్యాంప్ నిర్వహించామన్నారు. ఈ క్యాంపులో వివిధ కళాశాలల అధ్యాపకులు, బుల్లయ్య కాలేజీ లెక్చరర్లు పాల్గొని కోర్సును పూర్తి చేశారని తెలిపారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

చురుగ్గా బీటీ రోడ్ల నిర్మాణం



కప్పరాడ కూడలిలో నిర్మిస్తున్న బీటీ రోడ్డు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కంచరపాలెం పరిధి జాతీయ రహదారి నుంచి కప్పరాడ మీదుగా రాంజీ ఎస్టేట్, అంబేద్కర్ ఎస్టేట్, ఆరుంధతి నగర్, జైప్రకాశ్‌నగర్, పెదకొత్తూరు, బాపూజీనగర్, తిక్కవానిపాలెం కాలనీ వరకు వెళ్లే ప్రాంతాల్లోని అనుసంధాన మార్గాల్లో వీటిని నిర్మిస్తున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.వి.జి.కృష్ణ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ భరణికుమార్‌ల పర్యవేక్షణలో బీటీ రోడ్ల పనులు వేగవంతం చేశారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలను దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు.

నెరవేరనున్న సొంతింటి కల

- రెండు నెలల్లో లబ్ధిదారుల చేతికి టిడ్కో ఇళ్లు
- 90 శాతం పూర్తయిన పనులు
- పద్మనాభనగర్‌లో ప్రారంభానికి సన్నాహాలు



పద్మనాభనగర్‌లో తుది దశకు చేరుకున్న టిడ్కో ఇళ్లు

గోపాలపట్నం: ఎన్నో ఏళ్ల నుంచి టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. వారి కల మరో రెండు నెలల్లో నెరవేరనుంది. వచ్చే నెలలో నిర్మాణాలు పూర్తయి అధికారుల చేతికి ఇళ్లు అందబోతున్నాయి. ఆ తరువాత వాటిని లబ్ధిదారులకు అందించడం లాంఛనమే. జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో చేపడుతున్న టిడ్కో ఇళ్లు నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయి. కొన్ని బ్లాక్‌లకు రంగులు వేయడం, లోపల పనులు జరగాల్సి ఉంది. ఇక్కడ మొత్తంగా నాలుగు అంతస్తుల్లోని 16 బ్లాకుల్లో 816 ఇళ్లు నిర్మిస్తున్నారు. 300 చదరపు అడుగుల్లో 48 ఇళ్లు, 365 చదరపు అడుగుల్లో 336, 430 చదరపు అడుగుల్లో 432 ఇళ్లు నిర్మించారు. 300 చదరపు అడుగుల్లో ఉన్న ఇళ్లు పూర్తి ఉచితంగా ఉన్నారు. 365 చదరపు అడుగుల్లో(సింగిల్ బెడ్ రూమ్) ఇళ్లు రూ.3.15 లక్షలు విలువ గలివి. 430 చదరపు అడుగుల(డబుల్ బెడ్ రూమ్) ఇళ్లు రూ.3.65 లక్షలు విలువైనవి. (సబ్సిడీ మినహా) వీటికి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తారు. ఈ ప్రక్రియ ఇప్పటికే మొదలైందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

డీడీల అందజేత

గత ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల కోసం డబ్బులు చెల్లించి మంజూరు కాని వారికి తిరిగి వారి డబ్బులు చెల్లించే ప్రక్రియ మొదలైంది. చాలా మేరకు వారి నగదును డీడీ రూపంలో వెనక్కి ఇచ్చేస్తున్నారు. ఇప్పటి వరకు 602 మందికి మొత్తం రూ.1.70 కోట్లు నగదు తిరిగి చెల్లించారు. ఇంకా 482 మందికి రూ.1.17 కోట్లు చెల్లించాల్సి ఉంది.

దరఖాస్తు చేసుకోండి

టిడ్కో ఇళ్ల కోసం గతంలో డీడీలు కట్టిన వారు ఉంటే వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోండి. డీడీలు, ఇతర పత్రాల వివరాలను సచివాలయ కార్యదర్శులకు అందించండి. వాటి స్థితిని రెండంచెలుగా పరిశీలించి అందులో నిజమైనవని తేలితే వారికి వారి బకాయిలు చెల్లిస్తాం. ఈ సమాచారం సచివాలయ కార్యదర్శులకు అందిస్తాం. డీడీలు కట్టిన వారు సచివాలయానికి ఎప్పుడు రావాలో సెక్రటరీలు సూచిస్తారు.

– శ్రీరామ్, ఏపీటీ, జీవీఎంసీ జోన్-8

కేజీహెచ్ ఉద్యోగులకు ఎముక సాంద్రత పరీక్ష



సిబ్బందికి ఎముక సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మహారాణిపేట: కేజీహెచ్‌లో రెగ్యులర్, కాంట్రాక్ట్, సెక్యూరిటీ, శానిటేషన్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెండు రోజులుగా ఉచిత ఎముక సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్నారు. 45 ఏళ్లు దాటిన మహిళలు, 55 ఏళ్లు దాటిన పురుషులకు ఈ పరీక్షలు చేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఏఆర్ఎం డాక్టర్ జగదీష్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్ 242 మందికి పరీక్షలు జరిపారు. డాక్టర్ పఅశోక్‌కుమార్ మాట్లాడుతూ బోన్ డెన్సిటీ తగ్గితే ఎముకలు విరిగిపోవచ్చన్నారు. ఎముకల్లో కాల్షియం సాంద్రత తక్కువగా ఉంటే ఆలసట, నీరసానికి గురి కావడంతోపాటు ఎక్కువ దూరం నడవలేరన్నారు. అలాంటి వారు ఆకుకూరలు, మాంసాహారంతోపాటు కాల్షియం టాబ్లెట్లు తీసుకోవాలని సూచించారు.

నూతన విభాగాధిపతులకు అభినందనలు



ఇంజనీరింగ్ షాప్స్ హెచ్‌వోడీని సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని పలువురు నూతన విభాగాధిపతులను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ గుర్తింపు సంఘం నాయకులు అభినందించారు. ఇటీవల యాజమాన్యం విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు పలు విభాగాలకు నూతన హెచ్‌వోడీలను నియమించారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన సీజీఎం సర్వీసెస్ ఎం.ఎస్.వి. కృష్ణయ్య, పీపీఎం, మైన్స్ విభాగాల సీజీఎం ఎ.కె. సోర్టీ, ఇంజినీరింగ్ షాప్స్ హెచ్‌వోడీ ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్‌లను కలిసి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి.తాడన్న, ఎస్. సత్యనారాయణ, కె.వి.రత్నం, డి.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ రవీంద్ర తదితరులు

సింహాచలం: గ్లకోమా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి గ్లకోమా సీనియర్ స్పెషలిస్టు డాక్టర్ టి.రవీంద్ర తెలిపారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా గురువారం నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్లకోమా పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ టి.రవీంద్ర మాట్లాడుతూ గ్లకోమా అనేది నిశ్శబ్దంగా కంటి చూపును అపహరించే వ్యాధి అని తెలియజేశారు. ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకుని తగిన సమయంలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రోగులకు గ్లకోమా వ్యాధిపై చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు.కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగారాజు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో సేవా కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న షిర్డీసాయిబాబా. ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో ధ్యాన మందిర ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది భక్తులకు, పేదలకు వైద్య పరీక్షలు చేశారు.

కేంద్రానికి కనువిప్పు కలిగే వరకు ఉద్యమం




మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకునేంత వరకు ఉద్యమం ఆగదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు గురువారం నాటికి 763వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో ఎంఎంఎస్ఎం మరియు ఎస్‌టీఎం కార్మికులు కూర్చొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి, ప్రభుత్వరంగ సంస్థలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా పోరాడతామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం ప్రభుత్వ రంగ పరిశ్రమల వలన దేశంలో ఆర్థికాభివృద్ధి జరిగిందని, ఇది దృష్టిలో ఉంచుకుని కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కార్మిక హక్కులు అమలవ్వాలన్నా, నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలన్నారు. ఈ వారాంతానికి పోరాట కమిటీ సభ్యులంతా ఢిల్లీ వెళ్లేందుకు సమాయత్తమవుతున్నారని తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోవడం కోసం కార్మిక వర్గం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందన్నారు. కార్యకమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మంత్రి మూర్తి సేవలు మరువలేం

మేయర్ హరివెంకటకుమారి



మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

పెదగంట్యాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ కార్మిక నాయకునిగా మంత్రి మూర్తి అందించిన సేవలు మరువలేమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. ఆయన అకాల మరణం బాధాకరమన్నారు. నడుపూరులోని ఆయన నివాసంలో మంత్రి రాజశేఖర్, శంకర నారాయణ ఆధ్వర్యంలో గురువారం సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి చిత్రపటానికి మేయర్ హరివెంకటకుమారి దంపతులు పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, గొలగాని శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్మిక సంఘ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, గొందేశి సత్యారావు, ఆదినారాయణ తదితరులు పాల్గొని, సంతాపం వ్యక్తం చేశారు.

22 నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు



శ్రీరామ నవమి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నారాయణరెడ్డి, వరప్రసాద్

మురళీనగర్: శ్రీరామ నవమిని పురస్కరించుకుని మురళీనగర్ రామాలయంలో ఈ నెల 22 నుంచి 30 వరకు వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు గురువారం ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి సనపల వరప్రసాద్, కమిటీ సభ్యులు, అర్చక స్వాములు ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. వరప్రసాద్ మాట్లాడుతూ శ్రీరామనవమి వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సీతారాముల ఆలయ అర్చకుడు గొడవర్తి రఘురామాచార్యులు ఆధ్వర్యంలో ప్రతి రోజు స్వామికి వివిధ రకాల పుష్పాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు అష్టోత్తర నామార్చన ఉంటుంది. ఈ నెల 26న ఉదయం 8 గంటలకు నీరాటోత్సవం నిర్వహించి సీతారాములను పెండ్లి కుమార్తె, కుమారులుగా అలంకరించి అర్చనాదికములు జరుపుతారు. ఈ నెల 30న ఉదయం 9 గంటలకు సీతారాముల కల్యాణం, సాయంత్రం 6 గంటలకు పట్టాభిషేకం దర్బార్ సేవ, పవళింపు సేవలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 2న అన్నదానం జరుగుతుంది.

నూకాంబిక ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న గుండపు నాగేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలోని నూకాంబిక అమ్మవారి ఆలయ హుండీల ఆదాయాన్ని ఆలయ ధర్మకర్త, కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. భక్తులు సమర్పించిన నగదు రూ.66,530 ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 22 వరకు అమ్మవారి జాతర మహోత్సవాలను అత్యంత ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగిస్తామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నూకాంబిక అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘భౌ’బోయ్..!

పిచ్చి కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు





మల్కాపురం సర్వీసు రోడ్డులో కుక్కల గుంపు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. విచ్చల విడిగా సంచరించడంతో పాటు దాడులు చేస్తున్నాయి. దీంతో ఈ ప్రాంత వాసులు బెంబేలెత్తిపోతున్నారు. గురువారం సాయంత్రం నగరాల వీధిలో ఓ పిచ్చి కుక్క ముగ్గురిపై దాడి చేసింది. ఈ ఘటన చూసి ఆ ప్రాంత వాసులు భయాందోళనకు గురయ్యారు. ఆ కుక్కను స్థానిక యువకులు బంధించారు. క్షతగాత్రులు జీవీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందారు.

ఇదీ పరిస్థితి..

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ ఆలయం వెనుక వీధిలో,పల్లివీధి,గొల్లవీధి,నగరాల వీధి, మార్కెట్ లైన్ ప్రాంతంలో వీధికుక్కల పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా తిరుగుతుంటాయి. ఇవి ఆ సమయంలో ఆ మార్గాన రాకపోకలు సాగించే వారిపై దాడికి దిగుతున్నాయి. గురువారం సాయంత్రం నగరాల వీధి వద్ద ఓ పిచ్చి కుక్క ముగ్గురిపై దాడి చేసింది.దీంతో వారు భయాందోళన చెందారు. మహిళను తీవ్రంగా గాయపరిచింది. మల్కాపురం గాంధీజీవీధి ప్రాంతంలో గత వారం పాఠశాల నుంచి వస్తున్న బాలికపై కుక్క దాడి చేసింది. దీంతో ఆ బాలిక గాయపడింది. మార్కెట్ వీధిలో చేపలు కొనేందుకు వెళ్లిన 55 ఏళ్ల వ్యక్తిపై వీధి కుక్క దాడి చేసింది. ఇలా రోజూ ఏదో ఒక ప్రాంతంలో కుక్కల దాడికి గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, పాలకులు స్పందించడం లేదని స్థానికులు మండిపడ్డారు. ఎవరైనా వీధి కుక్కల పట్టే వారికి ఫోన్ చేస్తే వారు వచ్చి ఆ కుక్కలను బంధించబం.. మరలా అదే కుక్కలను వేరే ప్రాంతంలో విడిచిపెట్టడంతో మళ్లీ సమస్య నెలకుంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పిచ్చి కుక్క దాడిలో గాయపడిన మహిళ

వై20 నాలుగు రాష్ట్రాల ఇన్‌చార్జిగా వంశీయాదవ్



మర్రిపాలెం: బీజేపీ యువమోర్చా నిర్వహించే యూత్ ఎంగేజ్‌మెంట్ గ్రూప్ వై20 నాలుగు రాష్ట్రాల ఇన్‌చార్జిగా మురళీనగర్‌కు చెందిన ఉప్పిలి వంశీయాదవ్ నియమితుడయ్యారు. బీజేపీ జాతీయ యువమోర్చా అధ్యక్షుడు తేజస్వీ సూర్య ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వై20 చౌపల్స్ అనేక కార్యక్రమాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ రాష్ట్రాలకు ఏపీ విశాఖ నుంచి ఆయనను జాతీయ నాయకత్వం గురువారం నియమించింది. ఈ సందర్భంగా వంశీయాదవ్ మాట్లాడుతూ వై20 జాతీయ అధ్యక్షుడు తేజస్వీ తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర యువజనుల మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో జీ20 సభ్య దేశాలకు ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో వై20 చౌపల్స్ ద్వారా భారత్‌ను విశ్వగురువుగా చేసే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఉన్న యువతను భాగస్వామ్యం చేస్తామన్నారు. గ్రామాలు, విద్యాలయాలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, అకడమిక్ ట్రైనింగ్ సెంటర్లు, స్పోర్ట్ కాంప్లెక్స్‌ల్లో ఇలా యువత ఉన్న ప్రతి చోట సమావేశాలు నిర్వహించి వారి సలహాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. జీ20 అధ్యక్షతపై భారత్ బాధ్యత, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై వై20 బ్యానర్ ద్వారా తన బాధ్యతగా నాలుగు రాష్ట్రాల్లో 600 చౌపల్స్ సమావేశాలు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు తెలిపారు.

గెడ్డల నిర్వహణ ఘోరం!

- పూడికలు.. ప్లాస్టిక్ వ్యర్థాలమయం
- పట్టించుకోని ఇంజినీరింగ్ అధికారులు



శ్రీరాంనగర్ వద్ద చెట్లతో ప్రమాదకరంగా ఉన్న గెడ్డ



గెడ్డ పొడవునా ఉన్న వ్యర్థాలు



గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు

గోపాలపట్నం: ఆ ప్రాంతాలు గోపాలపట్నం నడిబొడ్డున ఉన్నాయి. జీవీఎంసీ 91, 92 వార్డులతో సరిహద్దులు పంచుకున్నాయి. నిత్యం అధికారులు, నాయకులు సంచరించే ప్రాంతాలు. అయినా ఇక్కడ గెడ్డల నిర్వహణ మాత్రం గాడితప్పింది. వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకు పోయాయి. పారిశుధ్య కార్మికుల కష్టించినా ఫలితం ఉండడం లేదు. దీంతో ప్రశాంతినగర్, శ్రీరాంనగర్ ప్రాంత వాసులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

పర్యవేక్షణ లోపమే కారణం

పూడికలు ఉండే గెడ్డల్లో ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించి పూడికలు తొలగించే పనులు చేపట్టేవారు. ఇపుడు ఆ పనిని ఇంజినీరింగ్ అధికారులు పూర్తిగా వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గెడ్డలు అనే సరికి నిర్వహణ బాధ్యత శానిటరీ విభానికే వదిలేస్తున్నారు.

ప్రమాదకరంగా గెడ్డ

ఈ గెడ్డల్లో పూడికలు తీయాలంటే యంత్రాలు అవసరమని స్థానికులు, పారిశుధ్య కార్మికులు చెబుతున్నారు. ఇందులో భారీ పాములతో పాటు గాజు పెంకులు ఉన్నాయి. ఇటీవల పాము కాటుతో రెండు పందులు చని పోయాయని స్థానికులు చెబుతున్నారు. చాలా చోట్ల ఊబిగా ఉంటుందని దిగితే కూరుకుపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

కార్మికులకు గాయాలు

ప్రశాంతినగర్ వద్ద గోడ కూలిపోవడంతో మురుగు నీరు పారలేదు. దీంతో ఇక్కడి పారిశుధ్య కార్మికులు పూడికలు తొలగించారు. ఆసమయంలో గాజు పెంకులు కోసుకు పోయి ఇద్దరు కార్మికులు గాయాలపాలయ్యారు. గోడలు కూలి పోవడంతో పెద్ద పెద్ద రాళ్లు ఉన్నాయని వాటిని తీయడం కష్టతరమయిందని చెబుతున్నారు. ఇంజినీరింగ్ అధికారులు కల్పించుకుని ఈ పనులు చేపట్టాలని కోరుతున్నారు. నిత్యం దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

పబ్లిక్ డిమాండ్

వీధిలైట్లు లేక ఇబ్బందులు



కాకరలోవలో వీధిలైటు లేని స్తంభం

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవలో వీధిలైట్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. చీకటి పడితే విష సర్పాలు, పురుగుల సంచారం అధికంగా ఉంటుంది. రాత్రి వేళ వీధుల్లో ప్రయాణించాలంటేనే భయమేస్తోంది. కుక్కలు వెంటపడి మరీ చిన్నారులను గాయపరుస్తున్నాయి. పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. ఈ సమస్యపై త్వరితగతిన స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలి.

– ఉప్పినవలస వెంకటేశ్వరరావు, కాకరలోవ